
# డాక్టరు బాబుకో దరఖాస్తు జాబు




"రౌడీ ఇజమ్ జిందాబాద్" అని కదా ప్రభుత్వమూ, ప్రజలూ పోటీలు పడి రుజువు చేస్తున్నది! నాకు మాత్రం హక్కు లేదా అనుకుని మా ఇంటి పక్క ఖాళీ జాగాను కొంతవరకూ సొంత ఇంటిలో కలుపుకున్నాను. తీరా నగర పాలక సంస్థ వాళ్ల ఇంటి ప్లాను కాగితాలు చూపించమంటే, చెప్పకేం - కాళ్లూ, చేతులూ వణికాము. పెద్దాపురంలో పేరు మోసిన వకీలున్నాడంటే విని వెంటనే బస్సెక్కేశాను. ఆయనతో నాకు కలిగిన అనుభవం మీకు చెప్పడం పెద్దమనిషి లక్షణం కాదు. ఎలాగా పెద్దమనిషిని కాను గనక నా కా ఇబ్బందీ లేదు!

నే వెళ్లే ముందే నలుగు రైదుగురు పార్టీలు 'కూలబడితే మరి ఓ పట్టాన లేవకుండా ఏర్పాటు చేసిన' కుర్చీల్లో ఆసీనులై ఉన్నారు. నాకూ ఆ అవస్థ తప్పలేదు. ఆయన నే నెవరో, ఎందుకొచ్చానో అడిగే ధోరణిలో లేరు. మిగిలిన వాళ్లూ అదే స్థితిలో ఉన్నా రనడానికి వారి వారి బిక్కమొహాలే సాక్షి.

"రవణా, ఒసే రవణా, ఎక్కడ చచ్చావే, తొందరగా దావే, ఇలా కూచో - మనవాళ్లే. ఏం అనుకోర్లే .... సిగ్గు పడకు" అంటూ వకీలుగారు. ఓ పదేళ్ల అమ్మాయిని మా ఎదురుగా కూచోపెట్టారు.

"పరికిణీ ఎత్తి ఆపాదం సరిగ్గా చూపెట్టవే .... ఇది మామూలు పాదం అనుకుంటున్నారు కదూ. అబ్బే! రెండేళ్ల కిందట స్కూల్నుంచి వస్తూంటే బస్సు కింద పడి ఎడం పాదం అంతా ముద్ద ముద్ద అయిపోయింది. యాంప్యుటేషన్ చేయించి, ఎలాగో పిల్లని బతికించుకున్నాం. ఆర్టిఫిషియల్ లిబ్ సెంటర్ వాళ్లకు కొలతలూ అవీ పంపించి ఈ ప్లాస్టిక్ పాదం తెప్పించాం. చెబితే గాని తెలీడం లేదు కదూ! సరే, నువ్వెళ్లి మీ చిన్నన్నని పంపవే!"

"వీడు మా మూడో అబ్బాయి విజయ్ అండీ! మొన్ననే మెట్రిక్‌కి ఎపియర్ అయాడు. వీడి కళ్లల్లో కళ్లు పెట్టి చూడండి. మీకేం తేడా కనిపించలేదు కదూ! ఉన్నట్టుండి ఆ మధ్య చాలా ఘోరమైన షార్టు సైటు పట్టుకుంది. ఎదుటిది కోతి పిల్లో తెలీదు. కొండచిలవో తెలీదు! స్కూలు కెళ్లే కుర్రాడికి ఇంతింత దళసరి కళ్లద్దాలు తగిలించడానికి నా తండ్రి ప్రాణం ఒప్పుకుంది కాదు సుమండీ! అయితే అయిందని హైద్రాబాదు తీసుకెళ్లి నేత్ర వైద్యుల్ని సంప్రదించాను. 'కాంటాక్టు లెన్సు' అంటారు. చూడండి అవి తగిలించారు కళ్లల్లో. కొత్తవి ఏవో పెట్టినట్టే లేదు కదూ! అదే తమాషా, ఏమనుకున్నారో మరి .... ఇంకా అలా కూచుంటావేంరా, వెళ్లి టీలు తెమ్మని మీ అమ్మకి చెప్పు."

".... ఇప్పుడు మీకు టీలు సప్లై చేసి వెళ్లిందే మా ఆవిడ. దాని ముఖంలో మీ రేం చిత్రం పసిగట్ట లేదూ? ఆరేళ్ల కిందట పల్లెటూళ్లోని మా ఇల్లు అంటుకున్నప్పుడు మా ఆవిడ సామాన్ల గదిలో చిక్కడిపోయింది. మరేం తొందర్లేదు, మీరు నెమ్మదిగా టీ పుచ్చుకోండి. ఆఁ, ఏమిటి చెబుతున్నానూ, మా ఆవిడకి జరిగిన ప్రమాదం గురించి కదూ .... ఎలాగో ప్రాణాలతో ఇవతల పడేశారు గాని, ఆ మొహం బాగా కాలిపోయింది. పచ్చడి చెయ్యడానికి వంకాయ కాలుస్తాం చూడండి అలా కుత కుత ఉడికిపోయింది. నెల రోజులు వైద్యం జరిగాక బతుకులో పడింది గాని తన మొహం అద్దంలో చూసుకుంటే ఆవిడే హడిలిపోయేలా తయారైంది. ఇలాంటి విషయాల్లో నేను డబ్బుకు చూసుకోను సుమండీ, దాన్ని తీసుకుని బొంబాయి వెళ్లి పడ్డాం. ఆర్నెల్ల వైద్యం, ఏభై వేల కైంకర్యం. ఆ ప్లాస్టిక్ సర్జరీతో మళ్లీ ఇలా అయిందంటే మేమే నమ్మలేక పోతున్నాం. దూరం నుంచి పోల్చలేం గాని ఆ మొహమంతా ముప్పై మూడు కుట్లు సుమండీ!"

"అయ్యయ్యో, లేచి నిలబడ్డారేం .... పర్వాలేదు. కేసు లనేవి ఇవాళ కాకపోతే రూపు చూసుకోవచ్చు. తొందర పనుం దంటారా? మీరే అలా మొహమాట పడిపోతే నేనేం చెప్పను? పోనీ, ఈ ఒక్క మాటా చెప్పి వెళ్లిపోండి. ఇంతసేపై వాగుతున్నాను. నాలో ఏ కృత్రిమ భాగమూ మీరు గుర్తించనే లేదా?"

వాళ్లకి అలవాటయిపోయిందేమో గాని ఈ పెర్వర్టెడ్ ఎగ్జిబిషనిజమ్ భరించడం ఇక నావల్ల కాకుండా పోయింది. ఎలాగో కుర్చీని విడిపించుకుని లేచి నిలబడ్డాను. అతను నా ఎడం చెయ్యి పట్టుకుని ఆపేశాడు. చటుక్కున తన నోట్లో చెయ్యి పెట్టుకుని రెండు వరసల కట్టుడు పళ్లూ నా కుడి అరచేతిలో పెట్టేడు. ఇల్లెరిగిపోయేటట్టు బోసినవ్వులు ఒలకబోస్తూ.

అంతే ! నేనేం చేశానో ఒళ్లెరగను.... ఆ ఎంగిలి పళ్లు ముప్పై రెండు ముక్క లయేటట్టు విసిరికొట్టాననుకుంటాను. అంతేనా? టాక్సీ చేయించుకుని సామర్లకోట చేరి మెయిల్లో పడేదాకా నా గుండె దడ ఆగలేదు. అయ్యబాబోయి, ఇంకా ఉంటే ఏం చూపిస్తాడో! ఇంతటి గొప్ప వకీలుని

కలుసుకోమని చెప్పిన మా ఫ్రెండుని ఏం చేసి బుద్ధి చెప్పాలా అని ఆపై బెర్త్ మీద కూచుని ఆలోచిస్తున్నాను.

నా గుండెల్లో ఇంకా వేగంగా రైళ్లు పరిగెత్తించగల శాల్తీ నా బెర్త్ కిందే ఉందని నే నప్పుడు గుర్తించలేకపోయాను. నాకు చెవుడు లేకపోవడం ఎంత దురదృష్టమో తెలిసిన క్షణం అదే.

ఓ మద గజలక్ష్మి మరో అర గజలక్ష్మితో తన శరీర బాధలు వివరిస్తోంది - "నాకు మొట్టమొదటి ఆపరేషను ఎప్పుడయిందనుకున్నావ్, పద్దెనిమిదో ఏట! మొన్న చేయించుకున్నది ఎన్నోది అంటావ్, ఎనిమిదోది! నలుగురు డాక్టర్లు ఆరు గంటలసేపు హూరాహూరీ పోరాడి, ఎనిమిది ఇంచీల మేర కడుపు నిలువునా చీరి, మేజర్ ఆపరేషన్ చేస్తే గాని ఆ బిడ్డ సంచీ ఇవతల పడలేదే మాయమ్మ!" ఇలా మొదలెట్టిన మనిషి మళ్లీ ఆపుచేసింది - ఆమె దిగవలసిన స్టేషనులో రైలు ఆగేకనే, వెడుతూ వెడుతూ అవి డన్న ముక్క ఇదే!

"ఇంతకీ నేను అనుభవిస్తున్న నిత్య నరకం నీకేం చెప్పినట్టు అయింది అమ్మాయీ ఆవగింజలో అరవయ్యో వంతు .... శరీరంలోని ఏ భాగాని కా భాగం శిథిలమైపోయి ఏదో ఇలా చావలేక దినాలు దొర్లిస్తున్నా ననుకో!".

ఇష్టం లేని ఏ కుటుంబ నియంత్రణ రేడియో ప్రోగ్రామో, గజ్జీ, చిడుమూ, తామరా వదలగొట్టే మందుని గానం చేస్తూ టీ.వీ. ప్రకటనో వస్తే వెంటనే కట్టేసి నోరు మూయిస్తాం. అలా కాదే ఇది ఎన్ని బేసిన్లతో పారబోసినా కంట్రోలు కాని రక్తస్రావం, ఎన్ని సెలైన్ బాటిల్సు ఎక్కించినా అందుకోని పల్సు రేటూ - ఇలాంటి జబ్బు భోగట్టాలు చచ్చినట్టు వినవలసిందే. రైలు దిగిపోతే మళ్లీ జీవితంలో తారసపడని కొత్త మనిషితో గంటల తరబడి తన రోగం అట్టు గుట్టు ఆనవాళ్లు అంత పెద్ద గొంతుకతో ఉటంకించిందంటే ఇంతకు మించిన హైపోకాండ్రియా ఇంకొకటి ఉంటుందనిపిస్తుందా? మిస్ వరల్డు బహుమతి లాగే మోస్ట్ ట్రబుల్డ్ ఎవార్డు ఏదైనా ఇస్తే మెరిసే కళ్లతో, వణికే చేత్తో తనంత కప్పు ఆవిడ సగర్వంగా ఎగిరే అందుకొనేదేమో!

నే నెందుకు బయలుదేరానో, నా సమస్య ఏమిటో ఎప్పుడో మరచిపోయాను. కుంపటిలోంచి గాడీ పొయ్యిలోకి గెంతి నట్టయింది. నా మనసు వకీలుగార్ని వదిలించుకున్నానంటే ఈ వనితామణి బారిన పడ్డా నేమిటి నేను! ఆ స్టేషనులో ఆవిడ దిగిపోయినా ఆ ధాటి న న్నింకా పీడిస్తోం దేమిటి!

'ఉబ్బసం ఘోరమా, మధుమేహం బాధాకరమా!' అనే చర్చనీయాంశంతో సభలు నడిపే చచ్చు పెద్దమ్మలు ఎవరూ ఉంవరు. అలాగే 'పయోరియో నయమా, ఫైలేరియా కష్టమా!' అనే కుశంకలు ఎవరూ లేవదియ్యరు. ఎందుకంటే స్వర్గాలు ఎన్ని వర్గాలో గాని నరకాలు మాత్రం నానా రకాలని అందరికీ తెలుసు. బాగా తెలిసిన మనసు కలిసిన ఆప్తులతో కష్టం పంచుకోడంలో తప్పు లేదు. అంతేగాని ఒక మొహమూ, రెండు చెవులూ కనీ కనపడగానే ఉండబట్టక, బట్ట ఉండక, తమ జబ్బు డప్పుతో ఎదుటి వారి తుప్పు వదలగొట్టే వారిని మించిన అంటురోగులు ఈ ప్రపంచంలో ఉండరు. లోకంలో శోకం పాలు తక్కువైందనా మనం సప్లై చెయ్యడానికి నడుం కట్టడం!

హాస్యాని కని మీ రంటే అనుకోండి గాని, నా కో చిత్రమైన ఆలోచన వచ్చింది. వీళ్ల రోగం కుదరాలంటే డాక్టరుగారి కిలా దరఖాస్తు చేసుకోవాలి.

"అయ్యా డాక్టరు మహాశయా! ప్రజాక్షేమం దృష్టిలో పెట్టుకుని మీ కో చిన్న సూచన. మీరు

ఆపరేషను పూర్తి చేసి శరీర భాగాలు, ఉన్నవో కృత్రిమమైనవో, సరిగ్గా అమర్చి కుట్టు వేస్తారు. చూశారూ, అప్పుడు, పనిలో పనిగా, బాబ్బాబు, ఆ పేషెంటు నోరు కూడా కాస్త కుట్టెయ్యరూ?"

*(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 25.9.91)*

